సాక్షి పల్నాడు

శనివారం । 17 । ఆగస్టు । 2024



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేటః పులిచింతల ప్రాజెక్టులో నీటి నిల్వ శుక్రవారం సాయంత్రానికి 44.85 టీఎంసీలకు చేరింది. దిగువకు రెండు గేట్ల ద్వారా 57737 క్యూసెక్కులు వదిలారు.



సామూహిక వరలక్ష్మి వ్రతం

పిట్టలవానిపాలెం: చందోలులోని శ్రీ బగ ళాముఖిని శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీ వరలక్ష్మీదేవిగా అలంకరించారు. సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 7,814 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

అన్న క్యాంటీన్ ప్రారంభించిన మంత్రి లోకేష్



తాడేపల్లి రూరల్: గుంటూరు జిల్లా నులకపేటలోని అన్న క్యాంటీన్‌ను శుక్రవారం పునః ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. కార్పొరేషన్ అధికారులు, టీడీపీ నాయకుల సమక్షంలో క్యాంటీన్‌ను ప్రారంభించి, అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుడివాడలో క్యాంటీన్‌ను ప్రారంభించారని, రాష్ట్రవ్యాప్తంగా 33 మున్సిపాలిటీల్లో 100 క్యాంటీన్‌లను పేద ప్రజల కోసం అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. దానిలో భాగంగానే మంగళగిరి నియోజకవర్గంలో 2 క్యాంటీన్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. నగర పంచాయతీల్లో 185 క్యాంటీన్లను అక్టోబర్ 2 నాటికి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ టీడీపీ అధ్యక్షులు నందం అబద్ధయ్య, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు, జిల్లా నాయకులు పోతినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

76,970 హెక్టార్లలో ఖరీఫ్ పంటల సాగు

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో ఖరీఫ్ పంటల సాగు సాధారణ విస్తీర్ణం 1,25,914 హెక్టార్లు కాగా, ఇప్పటి వరకు 76,970 హెక్టార్లలో సాగయ్యాయి. జూన్ మూడో వారం నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. జిల్లాలో వరి సాధారణ సాగు 63,733 హెక్టార్లు ఉండగా, 49,270 హెక్టార్లలో వెద పద్ధతిలో సాగు చేశారు. పత్తి 26,982కుగాను 18,927 హెక్టార్లలో సాగైంది. కంది 30, మొక్కజొన్న 23, పెసర 22, మినుము 554, వేరుశనగ 67, నువ్వులు 262, చెరకు 20, జూట్ 278, పసుపు 1101, టమాటా 1151, కూరగాయలు 1714, పచ్చిరొట్ట 3393 హెక్టార్లలో సాగయ్యాయి. మిరప సాధారణ విస్తీర్ణం 20,625 హెక్టార్లకుగాను 158 హెక్టార్లలో సాగు చేశారు. మిరప సాగుకు సెప్టెంబర్ రెండో వారం వరకు అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు.

వైభవంగా అమ్మవారి జన్మదిన వేడుకలు



తెనాలి: మండల పరిధిలోని బుర్రిపాలెం గ్రామంలో వేంచేసిన శ్రీసర్వదేవ పరంజ్యోతి మానవసేవ ఆలయంలో శ్రీసర్వదేవ పరంజ్యోతి భగవతి పద్మావతి అమ్మవారి జన్మదిన వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. బుర్రిపాలెం, పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వేడుకల్లో పాల్గొన్నారు. 108 కలశాలతో కోలాటం నడుమ ఊరేగింపుగా చక్రాయపాలెం, బుర్రిపాలెం నుంచి భక్తులు ఆలయానికి చేరుకున్నారు. భక్తిప్రపత్తులతో కలశ పూజలు చేశారు. అష్టలక్ష్మి పూజ నిర్వహించారు. భక్తులు తమ వెంట తెచ్చిన 108 ప్రసాదాలను అమ్మవారికి సమర్పించారు. ఆలయ పరిసరాల్లో మొక్కలు నాటారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ సేవకులు, సేవాసమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం తెనాలిలోని శ్రీమహాత్మా సేవాశాంతి ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు.

యార్డులో 46,624 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 39,118 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 46,624 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 18,700 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 16,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 18,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 17,864 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

అన్నన్నా.. ఇంత అన్యాయమా!

- అన్న క్యాంటీన్‌ల మరమ్మతులకు రూ.లక్షలు ఖర్చు
- కాంట్రాక్టర్‌కు నామినేషన్‌పై పనులు అప్పగింత
- జేబులు నింపుకుంటున్న కూటమి నేతలు



నరసరావుపేట లాల్‌బహదూర్ కూరగాయల మార్కెట్ సెంటర్‌లోని అన్న క్యాంటీన్

నరసరావుపేట: అధికార టీడీపీ కూటమి ప్రభుత్వ మానస పుత్రిక అన్నా క్యాంటీన్‌ల పునః ప్రారంభ పనుల్లో మున్సిపాల్టీ నిధులు దుర్వినియోగమౌతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్వల్ప పనులకు లక్షల్లో నిధులు కేటాయించారనే ప్రచారం జరుగుతుంది. పేదలకు స్వల్ప వ్యయంతో భోజనం, టిఫిన్ అందజేసేందుకు 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఒక్కొక్కటి రూ.35 నుంచి రూ.40లక్షల నిధులతో మూడు ప్రదేశాల్లోని ప్రభుత్వ స్థలాల్లో అన్నా క్యాంటీన్‌లు నిర్మించారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీ నుంచి అన్నా క్యాంటీన్‌లను వినియోగంలోకి తీసుకురావాలని సంకల్పించింది. దీనికిగాను ఇప్పటికే నిర్మించిన పట్టణంలోని లాల్‌బహదూర్ కూరగాయల మార్కెట్, పల్నాడు రోడ్డులోని పెద్దచెరువు బైపాస్ జంక్షన్, సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్‌ఏ స్టేడియం పక్కన అన్నక్యాంటీన్‌లను సుమారు రూ.30లక్షల వ్యయంతో ఆధునికీకరణ పనులు చేపట్టారు. వాస్తవానికి ఐదేళ్లుగా వీటిని వినియోగించకపోయినా దుమ్ము, ధూళి తప్పితే పాడైపోయింది ఏమీ లేదు. పల్నాడు రోడ్డు పెద్దచెరువు బైపాస్‌రోడ్డు జంక్షన్‌లోని అన్నా క్యాంటీన్ భవనంలో ఇటీవల వరకు పల్నాడు కళాక్షేత్రం నిర్వహించారు. అదిశుభ్రంగానే ఉంది. మిగతా రెండు మూసే ఉన్నాయి. ఇప్పుడు వీటి బాగోగుల కోసం రూ.30లక్షలకు పైగా నిధులు ఖర్చు చేయటం గమనార్హం. పనులు భాస్కరరావు అనే కాంట్రాక్టర్‌కు నామినేషన్‌పై అప్పగించారు. స్టేడియం పక్కగా ఉన్న క్యాంటీన్‌లో గతంలో లేని విధంగా టైల్స్ ఏర్పాటుచేస్తున్నారు. అన్నింటిలోను నీటి సరఫరా కోసం డ్రైనేజ్ పైపులు బాగుచేస్తున్నారు. జరుగుతున్న పనులను మున్సిపల్ కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కేటాయిచిన నిధులకు తగ్గట్లుగా పనులు లేవనేది సమాచారం.

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకే..
-బి.కనకారావు, మున్సిపల్ ఇంజినీరు

మూడు అన్నా క్యాంటీన్‌లకు రూ.30లక్షల ఖర్చు అయింది. ప్రతి క్యాంటీన్‌లో ఫ్లోర్ భాగం కుంగిపోయింది. ఐదేళ్ల నుంచి వాడుకలో లేకపోవడంతో వాటికి బిగించినవి మాయమయ్యాయి. ఈసారి ఫ్లోర్‌ను కాంక్రీటు వేసి టైల్స్ పరిపించాం.

మూడింటికి రూ.45లక్షలు



చిలకలూరిపేట ఎన్‌ఆర్‌టీ సెంటర్లోని అన్న క్యాంటీన్

చిలకలూరిపేటటౌన్: చిలకలూరిపేట పట్టణంలోని ఎన్‌ఆర్‌సీ సెంటర్, గడియారస్తంభం సెంటర్, అడ్డరోడ్డు సెంటర్లలో మూడు అన్న క్యాంటీన్లు ఉన్నాయి. ఆయా భవనాలు అంతా బాగానే ఉన్నాయి. కొంతకాలం వినియోగంలో లేని కారణంగా చెత్తచెదారం పేరుకుపోయి, వాటి రంగులు వెలిసి పోయాయి. వీటి మరమ్మతులకుగాను ఒక్కొక్క క్యాంటీన్‌కు రూ.15 లక్షల చొప్పున మూడింటికి కలపి ఏకంగా రూ.45 లక్షలు ఖర్చు చేశారు.



మాచర్ల పట్టణంలో ఆర్ అండ్ బీ బంగ్లా ఎదురుగా ఉన్న అన్న క్యాంటీన్

రూ.8.45 లక్షలతో మరమ్మతులు

పై చిత్రంలోని అన్న క్యాంటీన్ మాచర్ల పట్టణంలోని ఆర్ అండ్ బీ బంగ్లా ఎదురుగా ఉంది. ఈ క్యాంటిన్ మరమ్మతులకు రూ.8.45 లక్షలు నిధులు మంజూరు చేశారు. నిధులను మున్సిపాలిటీ మంజూరు చేస్తూ అనుమతులు తీసుకొంది. పురపాలక సంఘ కమిషనర్ వెంకటదాస్, ఏఈలు గౌతమి, ఆదిత్యల ఆధ్వర్యంలో అన్న క్యాంటిన్ మరమ్మతు పనులు పూర్తయ్యాయి.



వినుకొండలోని అన్న క్యాంటీన్

వినుకొండలో రూ.12లక్షలు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండలో అన్న క్యాంటిన్ మరమ్మతులకు సుమారు రూ.12 లక్షల ఖర్చు చేసినట్లు తెలిసింది. నిధులను మున్సిపాలిటీ జనరల్ ఫండ్ నుంచి మంజూరు చేసినట్లు సమాచారం.

మరమ్మతులకు రూ.13 లక్షలు

సత్తెనపల్లి: సత్తెనపల్లిలోని తాలూకా సెంటర్‌లో 2019 ఎన్నికలకు ముందు హడావుడిగా రూ.40 లక్షలు వెచ్చించి అన్న క్యాంటీన్ భవనం నిర్మించారు. ఇప్పుడు ఆ భవనం మరమ్మతులు నిమిత్తం రూ.13 లక్షలు వెచ్చిస్తోంది. అదీ మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి ఖర్చు చేస్తుండడం విశేషం. అసలే ఉద్యోగులకు, సిబ్బంది జీతాలకు ఇబ్బందిగా ఉంటున్న తరుణంలో మున్సిపాలిటీకి ఇది ఒక గుదిబండలా తయారైంది. బాగానే ఉన్నా భవనానికి కేవలం సోకులు చేసేందుకు రాత్రులు సైతం మెరిసే విధంగా విద్యుత్ లైటింగ్ బోర్డు వంటివి చేస్తూ ఇంత పెద్ద మొత్తంలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



సత్తెనపల్లిలో అన్న క్యాంటీన్

అన్నా...రూ.10లక్షలా?



పిడుగురాళ్ల పట్టణంలోని అన్నా క్యాంటిన్

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల మున్సిపాలిటీలో అన్న క్యాంటీన్ మరమ్మతులకు రూ.10 లక్షలతో ప్రత్యేక నిధులను మంజూరు చేశారు. ఫ్యామిలీ ఏర్పాటు, పెయింటింగ్, ఫ్లోరింగ్, బాత్రూంలు, వాష్ బేసిన్లు ఏర్పాటు చేయడంతోపాటు నేమ్ బోర్డులు, లోగోలు ఏర్పాటు చేయటం, ప్రాంగణంలో ఫ్లోరింగ్ వంటి పనులకు ఖర్చు చేసినట్లు మున్సిపల్ ఏఈ రాఘవేంద్ర తెలిపారు.

జిల్లాలో పది అన్న క్యాంటీన్‌లు ప్రారంభం

- రోజుకు 3500మందికి భోజనం, టిఫిన్
- కేవలం రూ.15లకే రెండుపూటలా భోజనం, టిఫిన్ అందజేత
- పల్నాడు బస్టాండ్‌లో క్యాంటీన్ ప్రారంభించిన కలెక్టర్ అరుణ్‌బాబు



క్యాంటీన్ ప్రారంభించి భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట: జిల్లాలో శుక్రవారం పది అన్న క్యాంటీన్‌లు ప్రారంభించామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. నరసరావుపేట పల్నాడు బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన క్యాంటీన్‌ను రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రోజూ ఒక్కొక్క క్యాంటీన్‌లో 350 మంది చొప్పున 3500మందికి టిఫిన్, రెండుపూటలా భోజనం పెట్టడం జరుగుతుందన్నారు. నిరుపేదలు, కూలీలకు ఈ క్యాంటీన్‌ల ద్వారా చాలా తక్కువ ధరకే టిఫిన్, భోజనం లభిస్తుందన్నారు. ప్రతి రోజూ అందజేయటం జరుగుతుందని చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ టిఫిన్ రూ.5, మధ్యాహ్నం భోజనం రూ.5, రాత్రి భోజనం రూ.5 మొత్తం రూ.15లకే అందజేయటం జరుగుతుందన్నారు. దక్షిణ భారతదేశంలోని తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే అన్న క్యాంటీన్‌లు పనిచేస్తున్నాయన్నారు. తిరిగి వీటిని ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్, జనసేన నాయకుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. తొలుత ఇరువురూ టిఫిన్ వడ్డించారు. మున్సిపల్ కమిషనరు సి.రవిచంద్రారెడ్డి, టీడీపీ నాయకుడు వేములపల్లి నరసయ్య, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యసేవలు బంద్

- కోల్‌కతాలో మహిళా డాక్టర్ హత్యను నిరసిస్తూ ర్యాలీ
- ఐఎంఏ డాక్టర్ల నిర్ణయం

నరసరావుపేట: పశ్చిమ బెంగాల్‌లో మహిళా డాక్టర్‌పై లైంగిక దాడి, హత్యను నిరసిస్తూ నరసరావుపేటలో ప్రైవేటు హాస్పిటళ్లలో వైద్యసేవలను శనివారం ఉదయం ఆరు నుంచి ఆదివారం ఎనిమిది గంటల వరకు బంద్ చేస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) డాక్టర్లు ప్రకటించారు. అత్యవసర సేవలకు మినహాయింపు ఉంటుందన్నారు. శుక్రవారం పెద్దచెరువులోని ఐఎంఏ భవనంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు నాగోతు ప్రకాష్, పాలూరి శ్రీనివాస రెడ్డి మాట్లాడారు. డాక్టర్‌పై జరిగిన ఘటనను ఐఎంఏ ఖండిస్తుందన్నారు. శనివారం ఉదయం 10గంటలకు గడియారం స్తంభం అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహిస్తామన్నారు. సంయుక్తకార్యదర్శి డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి, డాక్టర్లు వై.వరబాబు, గజ్జల బ్రహ్మారెడ్డి, జి.కృష్ణకాంత్, రాంప్రసాద్, కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎస్.ప్రదీప్‌రెడ్డి, ఎన్ రమేష్, ఎస్ బాజి, ఎన్.రాంప్రసాదరెడ్డి పాల్గొన్నారు.



శ్రీసత్యసాయి దివ్యమందిరంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

నరసరావుపేట ఈస్ట్: శ్రావణ మాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకొని పలు ఆలయాలలో మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. ఉదయం ఆలయాలలకు చేరుకొన్న మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమలు, గాజులు, నూతన వస్త్రాలను సమర్పించి పూజలు జరిపారు. పాతూరు శివాలయం, శ్రీచౌడేశ్వరీ అమ్మవారి ఆలయం, కల్యాణ సుందరేశ్వరస్వామి ఆలయం తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామిరెడ్డిపేటలోని శ్రీసత్యసాయి దివ్యమందిరంలో శ్రీసత్యసాయి సేవాసమితి కన్వీనర్ ఏ.వి.హరినాథ్‌బాబు ఆధ్వర్యంలో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్నారు.

బిల్లులకు రాజకీయ గ్రహణం

- మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లు
- ఎన్నికల ముందు సుమారు రూ.4 కోట్ల బిల్లులకు ఆమోదం
- సీఎఫ్ఎంఎస్‌లో ఐడీ ప్రక్రియ పూర్తి
- కాంట్రాక్టర్లకు చేతికి నగదు వచ్చేలోపు అడ్డుకున్న టీడీపీ నేతలు
- బిల్లులు వెనక్కి తెప్పిస్తేనే కొనసాగిస్తామని కమిషనర్‌కు బెదిరింపు
- అప్పటికే కమీషన్ రూపంలో సుమారు రూ.20 లక్షలు తీసుకున్న అధికారులు
- బిల్లులు వెనక్కి రావడంతో ఆందోళన చెందుతున్న కాంట్రాక్టర్లు

ఇప్పటికే రూ.కోట్లు ఖర్చు పెట్టారు.. బిల్లుల కోసం మున్సిపల్ అధికారుల చేతులు తడిపారు..రేపోమాపో బిల్లులు వస్తాయని ఆశగా ఎదురుచూస్తున్న కాంట్రాక్టర్లకు నిరాశే మిగిలింది. స్థానిక ప్రజాప్రతినిధి మోచేయి అడ్డుపెట్టినట్లు తెలిసింది. ఇక్కడ ఉండాలంటే బిల్లులు ఆపాల్సిందేనంటూ కమిషనర్‌ను బెదిరించినట్లు సమాచారం.



నరసరావుపేట మున్సిపల్ కార్యాలయం భవనం

సాక్షి, నరసరావుపేట: నరసరావుపేట మున్సిపల్ పరిధిలో గత ప్రభుత్వంలో పలు అభివృద్ధి పనుల కోసం టెండర్లు పిలిచారు. ఆయా పనులకు సంబంధించి డీపీఆర్‌లు పూర్తి చేసి వేలం ప్రక్రియ ద్వారా టెండర్లు వేశారు. అనంతరం ఆయా పనులకు సంబంధించి అధికారుల పర్యవేక్షణలో కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేశారు. అనంతరం చేసిన పనులకు సంబంధించిన బిల్లులు మునిపాలిటీలో సమర్పించారు. అన్ని బిల్లులపై స్క్రూట్నీ పూర్తయ్యి సీఎఫ్ఎంఎస్‌కు నగదు మంజూరు కోసం బిల్లులు వెళ్లాయి. మంజూరయ్యే సమయానికి ప్రభుత్వం మారింది. అంతే బిల్లులకు గ్రహణం పట్టింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కూడా పూర్తికాలేదు ఇప్పటికే రాజకీయ ప్రత్యర్థులపై భౌతిక దాడులకు పాల్పడి భయభ్రాంతులకు గురిచేస్తున్న అధికారపార్టీ మరో అడుగు ముందుకేసి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఆర్థిక మూలాలను దెబ్బతీస్తున్నారు. న్యాయంగా చేసిన అభివృద్ధి పనుల తాలుకా బిల్లులు మంజూరుకాకుండా అడ్డుకొని పైశాచిక ఆనందం పొందుతున్నారు.

ఇవీ పనుల వివరాలు..

టీడీపీ నేతలు అడ్డుకున్న బిల్లులు విలువ సుమారు రూ.4 కోట్ల దాకా ఉంటుందని పనులు చేసిన కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఇందులో ప్రధానంగా పట్టణంలో రూ.60 లక్షలతో అవసరమైన ప్రాంతాల్లో తాగునీటి అవసరాల కోసం సుమారు 50 చేతిపంపు బోర్లు, ప్రధాన నీటి సరఫరా పైపులైన్లకు బూస్టర్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మరమ్మతులు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, పారిశుద్ధ్య వాహనాలకు మరమ్మతులు, సచివాలయ మరమ్మతులు, జిల్లా ఆడిట్ కార్యాలయ మరమ్మతులతోపాటు పల్నాడు జిల్లా కలెక్టర్ బంగ్లాకు మౌళికవసతుల కల్పనలో భాగంగా వాటర్ ఫౌంటెన్, కల్వర్ట్, అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు చేశారు.

5 శాతం కమీషన్ సమర్పించుకున్నా...

పురపాలక శాఖకు సంబంధించి సుమారు రూ.4 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టారు. వాటికి సంబంధించి బిల్లులు మంజూరవ్వాలంటే 5 శాతం కమీషన్ ఇవ్వాలని పురపాలకశాఖలోని ఓ ఉన్నతాధికారి ఒత్తిడి తేవడంతో చేసేది లేక అడిగినంతా సమర్పించుకున్నారు. నగదు చేతికి వచ్చే సమయానికి బిల్లులు వెనక్కి రావడంతో కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. ఇలా సుమారు రూ.20 లక్షల మేర కమీషన్ అందించినప్పటికి మున్సిపల్ అధికారులు తమని మోసం చేశారని వాపోతున్నారు. ఈ వ్యవహారంపై ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

బిల్లులు ఆపితేనే ఉంటావు..

అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల డబ్బు అందే క్రమంలో స్థానిక ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు అడ్డుపుల్ల వేశారని సమాచారం. ఈ కాంట్రాక్టర్లలో వైఎస్సార్ సీపీ వారు ఉన్నారని, వెంటనే ఆ బిల్లులు రాకుండా నిలుపుదల చేయాలని కమిషనర్ రవిచంద్రను ఆదేశించారట. ఇప్పటికే బిల్లులు మంజూరు ప్రక్రియ చివరి దశకు రావడంతో ఇబ్బందులు వస్తాయని కమిషనర్ చెప్పడంతో.. ఆ బిల్లులు ఆపితేనే ఉంటావు అంటూ ఎమ్మెల్యే హెచ్చరించినట్టు సమాచారం. దీంతో కమిషనర్ చేసేదేమీ లేక ఆ బిల్లుల మంజూరులో కొన్ని మార్పులు ఉన్నాయని ఉన్నతాధికారులకు లెటర్ రాశారు. అంతే చేతికి అందాల్సిన బిల్లులు ఆగిపోయాయి. దీంతో కాంట్రాక్టర్లు ఘొల్లుమంటున్నారు. వేసిన రోడ్లు ఉన్నాయి.. చేసిన పనులు ఉన్నాయి.. మాకెందుకు బిల్లులు ఆపుతారంటూ ప్రశ్నిస్తున్నారు. ఓ మున్సిపల్ అధికారి అవినీతిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

లోపాలు ఉన్నందున బిల్లులు వెనక్కి



మున్సిపాలిటీ పరిధిలో చేసిన పలు అభివృద్ధి పనుల బిల్లులలో లోపాలు ఉన్నట్టు గుర్తించాం. దీంతో హెడ్ అకౌంట్స్ సెక్షన్ ద్వారా పంపించిన బిల్స్‌ను సీఎఫ్ఎంఎస్ నుంచి వెనక్క రప్పించాం. లోపాలు సరిచేసి మళ్లీ సీఎఫ్ఎంఎస్‌కు పంపేందుకు చర్యలు తీసుకుంటాం.

– రవిచంద్రారెడ్డి, కమిషనర్, నరసరావుపేట మున్సిపాలిటీ

ఆర్టీసీ నూతన బస్సు ప్రారంభం

సత్తెనపల్లి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సత్తెనపల్లి-నరసరావుపేట రూట్‌కు నూతన ఆర్టీసీ బస్సును స్థానిక శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం నాయకులతో కలిసి బస్సు ఎక్కి మొదటి టికెట్ కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ జీఎస్‌వీవీ.కుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



నూతన బస్సును ప్రారంభించి టికెట్ కొనుగోలు చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

క్లుప్తంగా

గౌతు లచ్చన్న సేవలు మరువలేనివి



మాచర్ల: సర్దార్ గౌతు లచ్చన్న సేవలు మరచిపోలేనివని గౌడ సంఘ జిల్లా నాయకులు పండ్ల మంగయ్య, గాలి కొండలు, మట్టపల్లి నారాయణ, బత్తిన వెంకటేశ్వర్లు, మట్టపల్లి నాసరయ్య అన్నారు. గౌతు లచ్చన్న జయంతి పురస్కరించుకొని పట్టణంలోని ఆయన విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ 1978లోనే గౌతు లచ్చన్న ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ప్రతిపక్ష నాయకుడుగా పనిచేశాడన్నారు. కార్యక్రమంలో పలువురు గౌడ సంఘ నాయకులు పాల్గొన్నారు.

రేపు వక్ఫ్ చట్టం సవరణలపై రాష్ట్ర స్థాయి సదస్సు

లక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్టం సవరణల గురించి రాష్ట్రస్థాయి సదస్సు ఈ నెల 18వ తేదీన ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ చిష్టి అన్నారు. బ్రాడీపేట గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముస్లింలపై బీజేపీ ప్రభుత్వం ఆర్థిక దాడులు చేస్తూ వక్ఫ్ స్వయం ప్రతిపత్తిని హరించేలా వ్యవహరిస్తోందన్నారు. ఈ విషయంలో కలెక్టర్లకు విచక్షణ అధికారాలు ఇవ్వడం సరి కాదన్నారు. ఈ చట్ట సవరణలు రాజ్యాంగ విరుద్ధమని ఆరోపించారు. పేద ముస్లిం ప్రజానీకం నుంచి ఆస్తులు కాజేసే కుట్రగా విమర్శించారు. వీటి గురించి అవగాహన కల్పించి ప్రజల్లో చైతన్యం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయ నిపుణులతో రాష్ట్ర సదస్సును 18వ తేదీ ఉదయం 10 గంటలకు బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తామని తెలిపారు. సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షులు ఎస్కే బాషా, ఖాసిం వలి, సలీం, ఎస్కే సైదా తదితరులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3000, గరిష్ట ధర రూ.4700, మోడల్ ధర రూ.4000 వరకు పలికింది.

తల్లిని బెదిరించబోయి యువకుడి మృతి



ప్రత్తిపాడు: తల్లిని బెదిరించేందుకు గడ్డి మందు తాగిన యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన ధర్నాసి కార్తీక్ (22) డిగ్రీ పూర్తి చేశాడు. పీజీ ఎంట్రన్స్ రాసి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. గత నెల 28వ తేదీన చర్చికి వెళ్లమని కార్తీక్‌ను తల్లి మందలించింది. ఆమె బెదిరించే క్రమంలో గడ్డి మందు తాగాడు. వాంతులు చేసుకుని తీవ్ర అస్వస్థతకు గురైన కార్తీక్‌ను చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 15వ తేదీన అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి నిర్మల ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు హెడ్‌కానిస్టేబుల్ బ్రహ్మనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నత్తనడకన రెండో ప్లాట్‌ఫామ్ పనులు

- రైలు ఎక్కేందుకు ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పిల్లలు, లగేజీతో మహిళలు రైలు ఎక్కాలంటే కష్టమే
- భారంగా మారిన వాహనాలు, సరుకులు తరలింపు



స్టేషన్‌లో నిర్మాణంలో ఉన్న రెండో ప్లాట్‌ఫామ్



నరసరావుపేట: నరసరావుపేట రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు కొంతకాలంగా నత్తనడకన నడుస్తున్నాయి. రైలు ఎక్కేందుకు వచ్చే ప్రయాణికులు తీవ్రమైన అసౌకర్యానికి గురవుతున్నారు. గుంటూరు-గుంతకల్లు మధ్యనున్న సుమారు 240 కిలోమీటర్ల రైల్వే లైను విస్తరణ ప్రక్రియ కొన్నేళ్లుగా జరుగుతుంది. గుంటూరు నుంచి శావల్యాపురం వరకు డబుల్ లైను పనులు పూర్తయ్యాయి. వీటి మధ్యనున్న రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ ప్రక్రియ చేపట్టారు. అందులో భాగంగా నరసరావుపేట రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు సుమారు రూ.6కోట్ల వ్యయంతో చేపట్టారు. గతంలో ఉన్న గూడ్స్ షెడ్‌ను తొలగించి డబుల్ లైను వేసిన అధికారులు రెండో ప్లాట్‌ఫామ్ నిర్మాణం చేపట్టారు. గూడ్స్‌షెడ్‌ను సాతులూరుకు తరలించారు. మొదటి రైల్వే ప్లాట్‌ఫాం నుంచి రెండో ప్లాట్‌ఫాంకు వెళ్లేందుకు వే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేశారు. రెండో ప్లాట్ ఫామ్ నిర్మాణ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. పనులు పూర్తికాకుండానే గుంటూరు, విజయవాడ వైపు వెళ్లే రైళ్లకు మొదటి ప్లాట్‌ఫామ్, వినుకొండ, దొనకొండ, గుంతకల్లు వైపు వెళ్లే రైళ్లు ఆగేందుకు రెండో ప్లాట్‌ఫామ్ కేటాయించారు. ఈ మేరకు రైళ్లు ఆయా ప్లాట్ ఫామ్‌లలో ఆగుతున్నాయి. మొదటి ప్లాట్‌ఫామ్‌కు ఎక్స్‌ప్రెస్ రైలు వచ్చిన వెంటనే ఏ బోగీ ఎక్కడ ఆగుతుందనే నేమ్ బోర్డులు ఉండగా, రెండో ప్లాట్‌ఫామ్ వైపున అటువంటి సౌకర్యం ఏర్పాటుచేయలేదు. లైట్లు సక్రమంగా ఏర్పాటు చేయలేదు. దీంతో రైలు రాగానే ఏ బోగీ ఎక్కడ ఆగుతుందనే విషయం తెలియక ప్రయాణికులు ముఖ్యంగా మహిళలు పిల్లలు, లగేజీతో పరుగులు తీసి తాము రిజర్వు చేసుకున్న బెర్తు ఉన్న బోగీ ఎక్కాల్సి వస్తుంది. ఎక్స్‌ప్రెస్ రైలు కేవలం రెండు, లేదా మూడు నిముషాలు స్టేషన్‌లో ఆగుతుంటాయి. ఈ సమయంలో బోగీ ఎక్కడ ఉందో తెలుసుకొని ఎక్కేలోపు రైలు కదులుతుందని ప్రయాణికులు వాపోతున్నారు. ప్లాట్‌ఫామ్ నిర్మాణ దశలో ఉండటంతో షెడ్ కోసం ఉపయోగిస్తున్న ఇనుప గడ్డర్లు ప్లాట్‌ఫామ్ స్థలాన్ని ఆక్రమించాయి. దీంతో రైలు ఎక్కాలంటే ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. ప్లాట్‌ఫామ్‌పై షెడ్ నిర్మాణ దశలో ఉండడంతో ప్రయాణికులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఇబ్బందిపడుతున్నారు. కనీసం కూర్చునేందుకు బల్లలు కూడా లేకపోవడంతో రైలు వచ్చే వరకూ నిలబడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

రోజుల తరబడి స్టేషన్‌లోనే...

హైదరాబాదు, సికింద్రాబాదు, బెంగళూరు ప్రాంతాలకు ద్విచక్రవాహనాలు, ఇతర వస్తువులు, సరకులు సరఫరా చేసేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అవసరమైన సిబ్బంది లేకపోవటంతో రైలు వచ్చిన సమయంలో వాటిని రైలులోకి చేరవేసేందుకు ఇబ్బంది పడుతున్నారు. బుకింగ్ కార్యాలయం, గోడౌన్ మొదటి ప్లాట్‌ఫామ్‌లో ఉన్నాయి. అక్కడ నుంచి సరకులు రెండో ప్లాట్‌ఫామ్ మీదకు తరలించటానికి ఇబ్బంది పడుతున్నారు. వాటిని తరలించలేక రోజుల తరబడి స్టేషన్‌లోనే ఉంచుతున్నారని ప్రయాణికులు చెబుతున్నారు. సాధ్యమైనంత త్వరగా రెండో ప్లాట్‌ఫామ్ పూర్తిచేసి కావాల్సిన ఏర్పాట్లు చేస్తే ఇబ్బందులు తొలగుతాయని ప్రయాణికులు అంటున్నారు.

20న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ అరుణ్‌బాబు, వైద్యాధికారులు



కలెక్టరేట్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, డీఎంహెచ్‌వో డాక్టర్ రవి

నరసరావుపేట: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ఆగస్టు 20వ తేదీన నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో వైద్యఆరోగ్యశాఖ అధికారులతో కలిసి ఆల్బెండజోల్ మాత్రలు, పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ అన్ని విద్యాసంస్థలకు ఈ మాత్రలు పంపిణీ చేయాలని, ఈ కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి మాట్లాడుతూ నులిపురుగుల వలన రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించటం, నీరసం, ఆందోళన, కడుపునొప్పి, వికారం, బరువు తగ్గటం వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని అన్నారు. కావున ఆల్బెండజోల్ టాబ్లెట్లు ద్వారా ఈ నులి పురుగులను నివారించవచ్చని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో ఒకటి నుంచి 19ఏళ్ల వయసు గల ప్రతి ఒక్కరికీ టాబ్లెట్లు అందజేయాలని కోరారు. భోజనం అనంతరం మాత్రమే ఈ టాబ్లెట్ తీసుకుంటే ఎలాంటి దుష్ప్రభావం ఉండదని తెలియచేశారు. ఒకటి నుంచి రెండేళ్లలోపు బాలబాలికలకు ఆఫ్ టాబ్లెట్ వేయాలని అన్నారు. ఈ మాత్ర వేసిన అనంతరం ఎటువంటి అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యాధికారులను సంప్రదించాలని సూచించారు. ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రు నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మావతి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, ఆర్‌బీఎస్‌కే నోడల్ ఆఫీసర్ స్వర్ణరాజరాజేశ్వరి పాల్గొన్నారు.

అమరేశ్వరునికి దివిస్ ల్యాబ్ వాటర్ ప్లాంట్ విరాళం



వాటర్ ప్లాంట్ నిర్మాణం కోసం స్థల పరిశీలన చేస్తున్న దివిస్ ల్యాబ్ ప్రతినిధులు, ఈఓ వేమూరి

అమరావతి: ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన అమరావతిలో కొలువైన అమరేశ్వరునికి సుమారు రూ.33లక్షల విలువైన గంటకు వెయ్యి లీటర్ల సామర్థ్యం గల వాటర్ ప్లాంట్‌ను దివిస్ లాబోరేటరీస్ లిమిటెడ్ విరాళంగా సమర్పించింది. సంస్థ ప్రతినిధులు మంగళవారం ఈవో వేమూరి గోపినాథశర్మకు అంగీకార పత్రాన్ని అందజేశారు. కంపెనీ ప్రతినిధి కిషోర్ మాట్లాడుతూ దేవాలయంలో అమరేశ్వర జలప్రసాదం భక్తులకు అందచేయటం కోసం రూ.33,27,600లతో రెండు 1000 ఎల్‌పీహెచ్ ఆర్‌వో ప్లాంట్‌లు, యూపీవీసీ షెల్లర్‌లు, కూలర్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే వేసవి నాటికి భక్తులకు పరిశుభ్రమైన తాగునీరు అందించటానికి కృషి చేస్తామన్నారు. ఆలయ ఈవో వేమూరి గోపినాథశర్మ మాట్లాడుతూ దేవాలయంలో వాటర్ ప్లాంట్ నిర్మాణానికి కంపెనీ ప్రతినిదులతో కలసి స్థలపరిశీలన చేశామన్నారు.

తుమ్మకోటలో ఇరువర్గాల ఘర్షణ

ఐదుగురికి గాయాలు



క్షతగాత్రుడు పొట్టిపోగు పెదయాకోబు

రెంటచింతల: మండల పరిధిలోని తుమ్మకోట గ్రామంలో శుక్రవారం ఉదయం కుటుంబ కలహాలు, పాత కక్షల కారణంగా ఘర్షణ చోటుచేసుకుంది. టీడీపీకి చెందిన పొట్టిపోగు పెదయాకోబు, ఆలేటి సంసోన్ వర్గీయులకు కొంతకాలంగా వ్యక్తిగత తగాదాలు ఉన్నాయి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల అనంతరం గ్రామం విడిచిపోయిన వైఎస్సార్ కార్యకర్తల గురించి పొట్టిపోగు చిన్న యాకోబు, ఆలేటి సంసోన్‌ల మధ్య రెండు వారాల కిందట వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం పొలం పనులకు వెళ్తున్న పొట్టిపోగు చిన్న యాకోబును సంసోన్, అతని వర్గీయులు కర్రలు, గొడ్డళ్లతో దాడిచేసి గాయపరిచారు. ఈ విషయం తెలుసుకున్న యాకోబు వర్గీయులు పెద్ద యాకోబు, పొట్టిపోగు నగేష్, పొట్టిపోగు సుందరరావు, పొట్టిపోగు బుజ్జిబాబులు స్థానిక పశు వైద్యశాల సమీపంలో సంసోన్ వర్గీయులు ఆలేటి థామస్, ఆలేటి నవీన్, ఆలేటి యాకోబు, ఆలేటి రాజేష్, ఆలేటి దావీదు, ఆలేటి యేసోబులు ఒకరిపై ఒకరు దాడిచేసుకున్నారు. ఘర్షణలో పొట్టిపోగు పెద్ద యాకోబు తలపై గొడ్డలితో దాడిచేయడం వలన 12 కుట్లు పడ్డాయి. అతనితోపాటు పి.చిన్న యాకోబు, పి.సుందరరావు, పి.నగేష్, పి.బుజ్జిబాబు గాయపడ్డారు. క్షతగాత్రులను తుమ్మకోటలో ప్రథమ చికిత్స చేయించి వెంటనే గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారిలో పొట్టిపోగు పెద్ద యాకోబు, చిన్న యాకోబును మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. వీరందరూ ఎస్సీ సామాజిక వర్గం, టీడీపీకి చెందిన వారే కాకుండా బంధువులు కూడా. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున ఘటన స్థలానికి చేరుకున్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



క్షతగాత్రుడు పొట్టిపోగు నగేష్



క్షతగాత్రుడు పొట్టిపోగు చిన్న యాకోబు

ఘనంగా రికగ్నేషన్ డే



రికగ్నేషన్ డే కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా నాయకులు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యాలయంలో రికగ్నేషన్ డే ఘనంగా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు స్వర్ణ చినరామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఏర్పడినప్పటి నుంచి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నదని తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వానికి అవగాహన కల్పించి సరైన పరిష్కారాలు చూపుతున్నదని వివరించారు. సంఘం నిర్మాణంలో ప్రారంభం నుంచి కె.ఆర్. సూర్యనారాయణ ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగులతో సభ్యత్వ నమోదు చేపట్టాలని నిర్ణయించారు. స్వాతంత్ర్య వేడుకల్లో ప్రశంసా పురస్కారాలు అందుకున్న బాలునాయక్, బి.బాలత్రిపురసుందరిలను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి చుక్కా వెంకటేశ్వరరావు, తాలూకా యూనిట్ అధ్యక్షురాలు ఎం.ఫ్లోరెన్స్, జిల్లా కోశాధికారి పీటర్‌డామియన్, జాయింట్ సెక్రటరీ షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పల్నాటి వీర్ల అంకాలమ్మ మహోత్సవం



అమ్మవారిఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

కారెంపూడి: పల్నాటి రణక్షేత్రంలో కొలువైఉన్న వీర్ల అంకాలమ్మ తల్లి బోనాల ఉత్సవం శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కనులపండువగా జరిగింది. కుంకుమ బండ్లు కట్టి వేలాదిగా మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. అంకాలమ్మతో పాటు గ్రామ దేవతలు పోలేరమ్మ తల్లి. పాతపాటేశ్వరమ్మ అమ్మవార్లకు పోతురాజుకు భక్తులు నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. వర్షాలు సంవృద్ధిగా పడి పంటలు బాగా పండాలని గ్రామదేవతలకు పూజలు చేశారు. ఉత్సవంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు. కుంకుమబండ్లకు పూజలు చేసి వాటిని ప్రారంభించారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. దీంతో ప్రతి గడపలో పండుగ వాతావరణం నెలకొంది. రాత్రి పల్నాటి బ్రహ్మనాయుడు నృసింహ కుంతం తోడురాగా అంకాలమ్మ తల్లి గ్రామోత్సవానికి బయలు దేరారు. ప్రతి గడప అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామం మొత్తం యువకుల కేరింతలతో మహిళ భక్తిపారవశ్యంతో గ్రామం పూర్తిగా అమ్మవారి నామస్మరణతో మార్మోగిపోయింది.

గుంటూరు రేంజ్‌లో మరో ఆరుగురు సీఐలు బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో మరో ఆరుగురు సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీచేశారు.

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
జి.వేణు	రేంజ్ వీఆర్, గుంటూరు	నెల్లూరు రూరల్ పీఎస్, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా
షేక్.సుభాని	రేంజ్ వీఆర్, గుంటూరు	నార్త్ ట్రాఫిక్ పీఎస్, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా
జి.రాజేశ్వరరావు	రేంజ్ వీఆర్, గుంటూరు	కావలి రూరల్ యూపీఎస్, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా
టి.వెంకటేశ్వర్లు	రేంజ్ వీఆర్, గుంటూరు	పొదిలి సర్కిల్, ప్రకాశం జిల్లా
ఎ.అశోక్‌కుమార్	డీసీఆర్‌బీ, పల్నాడు	ఈస్ట్ ట్రాఫిక్ పీఎస్, గుంటూరు జిల్లా
మేడా శ్రీనివాసరావు	ఇంటెలిజెన్స్	ఒంగోలు 2 టౌన్ పీఎస్, ప్రకాశం జిల్లా

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి టీ10 క్రికెట్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): మొట్టమొదటిసారిగా టీ10 రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎస్ క్రిస్టోఫర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నుంచి స్థానిక బీఆర్ స్టేడియంలో ఈ పోటీలు ఉంటాయన్నారు. అండర్-14, 17, 19, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తామన్నారు. ప్రతిభకనబరచిన క్రీడాకారులను అక్టోబర్‌లో జరగనున్న జాతీయ పోటీలకు పంపిస్తామన్నారు. పూర్తి వివరాలకు 92741 11266 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

కంటి వెలుగు 'పీఎస్ఆర్'

- 75 వేల మందికి ఉచితంగా ఆపరేషన్‌లు
- 2.25 లక్షల మందికి వైద్యం
- ప్రతిరోజూ 200 నుంచి 300 మందికి వైద్య పరీక్షలు



పీఎస్ఆర్ ఆంజనేయులు మీనాక్షి కంటి వైద్యశాలలోని ఆపరేషన్ థియేటర్




పిఎస్ఆర్ ఆంజనేయులు మీనాక్షి కంటి వైద్యశాల భవనం



ఆసుపత్రి వ్యవస్థాపకులు పీఎస్ఆర్ ఆంజనేయులు మీనాక్షి దంపతులు

మాచర్ల: కంటి సమస్యలతో బాధపడుతూ..వందల కిలోమీటర్లు వెళ్లి వైద్యం చేయించుకోలేక అవస్థలు పడుతున్న పల్నాడు ప్రజలను చూసి ఓ ఎన్నారై చలించిపోయారు. వారిని ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. ఉచితంగా సేవలు అందిస్తూ కంటి వెలుగును ప్రసాదిస్తున్నారు. తెనాలి ప్రాంతానికి చెందిన పీఎస్ఆర్ ఆంజనేయులు, మీనాక్షి దంపతులు అమెరికాలో స్థిరపడ్డారు. వీరు స్థానికంగా పలు వైద్య క్యాంపులు నిర్వహిస్తున్న చిరుమామిళ్ల కృష్ణయ్య, చెరుకూరి నరసింహారావులతోపాటు పలువురు ప్రముఖులను సంప్రదించారు. పీఎస్ఆర్ ఆంజనేయులు మీనాక్షి పేరుతో 2010లో మాచర్ల పట్టణం రింగ్‌రోడ్డు నుంచి సాగర్‌కు వెళ్లే రహదారిలో 63 సెంట్ల స్థలంలో కంటి ఆస్పత్రిని ప్రారంభించారు. పట్టణానికి చెందిన పలువురు వైద్యులు, రోటరీ క్లబ్ సభ్యులు, కేసీపీ సంస్థ కూడా ముందుకొచ్చి ఆసుపత్రి అభివృద్ధికి తమ వంతు చేయూతనందించాయి. అంతకు ముందు క్యాంపులు నిర్వహించి పాలకొల్లు శుక్లాల కంటి వైద్యానికి పంపేవారు. పేదలు ఎవరూ కంటి వైద్యం కోసం ఇబ్బంది పడకూడదని అత్యంత ఆధునిక సౌకర్యాలతో బిల్డింగ్ నిర్మాణం, రక్తపరీక్షలు, ల్యాబ్ సౌకర్యం, ఆపరేషన్ థియేటర్, రోగులకు నివాసిత రూమ్‌లతోపాటు అన్ని రకాల ఆధునిక సౌకర్యాలతో ఆసుపత్రిని ఆధునికీకరించారు. ఆసుపత్రి స్థాపించిన నాటి నుంచి నేటి వరకు 2.25 లక్షల మందికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. 75 వేల మంది ఉచిత కంటి శుక్లాల ఆపరేషన్‌లు జరిపారు. ఆసుపత్రికి ప్రతిరోజూ సుమారు 200 నుంచి 300 లోపు వైద్య పరీక్షలకు తరలివస్తున్నారు. వారంలో ఐదు రోజులపాటు కంటి ఆపరేషన్‌లు నిర్వహిస్తారు. ఆదివారం తాత్కాలిక వైద్యపరీక్షలు మినహా ప్రతిరోజూ ఉదయం 9 నుండి రాత్రి 9 గంటల వరకు ఈ వైద్యశాలలో సిబ్బంది అందుబాటులో ఉంటారు. కంటి వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్‌లు అందుబాటులో ఉండి ప్రతి ఒక్కరికి సేవలు అందిస్తుంటారు. ఈ ఏడాది జనవరి నుంచి ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్‌లు నిర్వహించేందుకు ఈ ఆసుపత్రికి అనుమతులు లభించాయి. మాచర్ల, గురజాల నియోజకవర్గాలతోపాటు తెలంగాణ నుంచి రోగులు కంటి వైద్యం పొందేందుకు ఈ ఆసుపత్రికి తరలి వస్తుంటారు.


రాబోయే రోజుల్లో మరిన్ని సేవలు



14 ఏళ్ల కిందట ఎన్నారై పీఎస్ఆర్ ఆంజనేయులు, మీనాక్షి దంపతులు ఆసుపత్రికి అంకురార్పణ చేశారు. ఆ నాటి నుంచి వారి స్ఫూర్తితో ఉచితంగా వైద్యం అందిస్తూ లక్షల మందికి కంటి వెలుగులు కల్పించాం. ఈ అవకాశాన్ని ఇచ్చిన పీఎస్ఆర్ ఆంజనేయులు దంపతులను పల్నాటి ప్రజలు ఎన్నటికీ మరిచిపోలేరు. రాబోయే రోజులలో మరిన్ని సేవలు అందిస్తాం.

చిరుమామిళ్ల కృష్ణయ్య,
ఆసుపత్రి కమిటీ చైర్మన్

నా అదృష్టం



ఒకనాడు క్యాంపుల మీద ఆధారపడి పేద ప్రజలు ఇబ్బందిపడే వారు. దూర ప్రాంతాలకు వెళ్లి నానా తంటాలుపడే వారు. అందుకు భిన్నంగా పీఎస్ఆర్ ఆంజనేయులు, మీనాక్షి దంపతులు ప్రత్యేకంగా పేదల కోసం ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రి సేవలు ప్రజలు మరిచిపోలేనివి. ఈ ఆసుపత్రిలో సేవ చేయటం నా అదృష్టం. పేదలంతా ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని కంటి వెలుగులు పొందాలి.

చెరుకూరి నరసింహారావు,
ఆసుపత్రి డైరెక్టర్

ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగా డెంగీ పరీక్షలు

మలేరియా రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ ఏటీ రామనాథం

తెనాలి అర్బన్: జిల్లా పరిధిలోని గుంటూరు, తెనాలి ప్రభుత్వ వైద్యశాలల్లో డెంగీ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తున్నామని మలేరియా రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ ఏటీ రామనాథం సూచించారు. తెనాలి జిల్లా వైద్యశాలలోని ల్యాబ్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలపై ఆరాతీశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉందని తెలిపారు. ప్రజలందరూ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పాత ప్రభుత్వ వైద్యశాలలోని సహాయ మలేరియా కార్యాలయాన్ని పరిశీలించారు. అక్కడ రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంటమాలజిస్ట్ పోలు కొండారెడ్డి, ఎస్.రామచంద్రుడు, సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి, తెనాలి పట్టణ, మండల, గుంటూరు పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, వంగల పున్నారెడ్డి, ఎస్.శివగణేష్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాల చంద్రమౌళి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ గుద్దంటి రవికుమార్, సూపర్‌వైజర్ మలేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.